## ఘట్‌కేసర్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో వెళ్లిపోతున్న ఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 10 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య యాదవ్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపో యింది. బుధవారం అధికారులు నిర్వహించిన సమావేశానికి పాలకవర్గం సభ్యులు ఎవరు కూడా హాజరు కాకపోవడంతో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని ఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డి తెలిపా రు. ఘట్‌కేసర్ చైర్‌పర్సన్‌పై కొంత మంది సభ్యులు అవిశ్వాసం అంటూ కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్డీఓ, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకవర్గం సభ్యులు ఎవరు కూడా హాజరు కాకపోవడంతో కలెక్టర్ వద్ద పెట్టిన దరఖాస్తు రద్దయినట్లు అధికారులు ప్రకటిం చారు.

## రాజీనామా..

ఘట్‌కేసర్,ఏప్రిల్10: బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు పంపారు.

# మైనార్టీల సంక్షేమానికి బీఎల్ ఆర్ ట్రస్టు కృషి హర్షణీయం

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మసీద్ ఇమామ్, మోజన్‌లకు దుస్తుల అందజేత

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇమామ్, మోజన్‌లకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, ఏప్రిల్ 10 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కాప్రా డివిజన్, సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజాన్ సందర్భంగా మసీద్ ఇమామ్, మోజన్‌లకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో స్పీకర్ చేతుల మీదుగా నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి చేయడం హర్షణీయమని, ముఖ్యంగా ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి మాట్లాడుతూ.. కులాలు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ బద్రుద్దీన్, నాయకులు ఎస్ఏ.రహీం, మహ్మద్, నయూం, కరీం, పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు , తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అభ్యర్థి రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం..

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 10 : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని బుధవారం వినాయకనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే.. వివిధ అంశాలపై వారితో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో రంపె చంద్రమౌలి, రాంలాల్, గోపాల్, తదితరులు ఉన్నారు.

## కాలనీవాసుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తాం..



అసోసియేషన్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 10 : కాలనీవాసుల సంక్షేమానికి తనవంతు తోడ్పాటు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం డివిజన్ స్నేహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌లు హాజరైనారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తమవంతు సహకారం అందజేస్తామన్నారు. సమాజశ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు ముందుకువచ్చి, సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, నేతలు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కుషాయిగూడ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం

చర్లపల్లి, ఏప్రిల్ 10 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కుషాయిగూడ పారిశ్రామి కవాడలో ఉత్తరాంధ్ర సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త రామారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రధాన రహదారులతో పాటు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందు కురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సేవాసమితి ఫౌండర్, అధ్యక్షుడు దండుగుల తారకేశ్వర్‌రావు, వంజరపు సింహాచలం, ఎర్రంనాయుడు, బైరి లక్ష్మణ్, చిన్నికృష్ణ, లక్ష్మీనారాయణ, శివ, చిట్టిబాబు, బోడ శ్రీనివాస్‌రావు, శేషగిరి, కోటేశ్వర్‌రావు, రాము, అనిల్ కుమార్, ఆనంద్ రెడ్డి, శంకర్‌నారా యణ, శంకర్, ఉమామహేశ్వర్ రావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కాచివానిసింగారంలో నీటి సమస్యను పరిశీలిస్తున్న సీఈఓ దిలీప్ కుమార్, అధికారులు

ఘట్‌కేసర్,ఏప్రిల్ 10: ఘట్‌కేసర్ మండలంలోని కాచివాని సింగారంలో ఏర్పడిన తా గునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం గ్రామంలో జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్ కుమార్, డీపీఓ వెంకటయ్య, ఎంపీడీఓ గీతలు పర్యటించి.. నీటి సమస్యను తెలుసుకున్నారు. సీఈఓ వెంటనే మంచినీటిని అందించాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ గ్రామానికి నీటి సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

హేమనగర్ కమ్యూనిటీ పార్కును శుభ్రం చేస్తున్న సభ్యులు

## ఇంకుడు గుంతలపై అవగాహన

ఉప్పల్, ఏప్రిల్ 10 : ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఉప్పల్ హేమనగర్ కమ్యూనిటీ పార్కులో యోగ, షటిల్ సభ్యులు బుధవారం ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్కును శుభ్రం చేసి, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. భూగర్భ జలాలు పెంపొందించేవిధంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, మోహన్‌రావు, కవిత, శారద, ధనలక్ష్మి, రాజేశ్, ప్రసాద్‌రెడ్డి, గిరి, రవి యాదవ్, సుశీల, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రాజు, హరిపాల్, తదితరులు పాల్గొన్నారు.

నాగారంలోని ఎస్వీ నగర్‌లో తొలగించిన బస్‌షెల్టర్

## చర్యలు తీసుకోవాలి..

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : బస్‌షెల్టర్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని ఎస్వీనగర్ ప్రధాన రోడ్డుపై ఫర్నిచర్ షాప్ పక్కన నిర్మిస్తున్న భారీషెడ్ నిర్మాణదారుడు నిర్మాణానికి అడ్డుగా ఉందని బస్‌షెల్టర్‌ను రాత్రి సమయంలో తొలగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా.. బస్సు షెల్టర్‌ను కూల్చివేసిన రమేశ్ పటేల్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బుధవారం కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే ఈ నెల 9న సెలవు రోజున తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సమాన పనికి... సమాన వేతనం చెల్లించాలి

వేతనాలు పెంచాలని కోరుతూ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 10: సమానపనికి సమాన వేతనం చెల్లించాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు శివ బాబు అన్నారు. తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం లో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డిని కలిసి వేతనాలు పెంచాలని వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. వాటర్ మెన్స్, ఎలక్ట్రిషియన్స్, బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నామని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు లేవని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు విన్నవించి వేతనాలు పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శివబాబు, ఉపాధ్యక్షుడు రాములు, చందర్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, ప్రకాశ్, పరశురాం, మల్లేశ్, జాన్, కరుణమ్మ, రేణుక, వెంకమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలు..

రామంతాపూర్, ఏప్రిల్ 10 : నాచారం దక్కన్ స్కూల్‌లో బుధవారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ పవన్ సాంబ, కోర్ ఆపరేషన్స్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ ..విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమమీనన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమణి కంఠ, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో చిన్నారులు

## ఆర్థిక సాయం..

శామీర్‌పేట, ఏప్రిల్ 10 : అలియాబాద్ జడ్పీహెచ్ఎస్ 1991-92 విద్యార్థులు.. తమ స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బాబు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి 1991-92 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు.. బాబు కూతుళ్ల పేరుపై రూ.20 వేలను ఫిక్స్ డిపాజిట్‌చేసి బాండ్లను బుధవారం అందజేశారు.

## 15న 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 10: ఐక్య రాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ లక్ష్మి మురుదేశ్వర్ పురి రచించిన 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకాన్ని ఈ నెల 15న హోటల్ తాజ్‌కృష్ణలో ఆవిష్కరించనున్నట్లు ప్రభా ఖైతాన్ ఫౌండేషన్ ప్రతినిధి బాబీ కందారియా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సివిల్ సర్వీస్ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న లక్ష్మి ఇప్పటికే పలు పుస్తకాలు రచించారన్నారు. సమాజంలో స్ఫూర్తి రగిలించే ఆమె పుస్తకాల పంపరలో భాగంగా 15న పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్‌పట్ల అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్, ఏప్రిల్ 10 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని మేడ్చల్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మునిగంటి రాంప్రదీప్ నివాసంలో కాలనీ సంక్షేమ సంఘాలు, కుల సంఘాలతో ఏర్పాటు చేసిన టిఫిన్ బైటిప్ కార్యక్రమానికి ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎనుముల మహేశ్‌కుమార్, బండి లక్ష్మణ్, బ్రహ్మచారి, నర్సింగ్, మురళీచారి, ఉమాదేవి, శశికళ పాల్గొన్నారు.

- ఉప్పల్, ఏప్రిల్ 10 : హబ్సిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, శాంతికుమార్ పాల్గొన్నారు.

## 'ఓయూను క్లోజ్డ్ క్యాంపస్ చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 10: ఉస్మానియా యూనివర్సిటీని క్లోజ్డ్ క్యాంపస్‌గా చేసి, ఓయూలో విద్యావాతావరణాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ బయట వాహనాలు, వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా ఎన్‌సీసీ గేటు నుంచి అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌ను కలుపుతూ రోడ్డు నిర్మించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఓయూలోకి కొంతమంది బయటి వ్యక్తులు ప్రవేశించి, గంజా యి, మద్యం సేవించడం, మహిళల హాస్టళ్లలోకి ప్రవేశించి వేధించడం, వాహనాలు నేర్పించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిని అరికట్టేందుకు ఓయూ ను క్లోజ్డ్ క్యాంపస్‌గా చేయడమే తప్ప మరో పరిష్కారం లేదన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశం

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ..జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించే వనరులను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన సెంటర్లతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎం డాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త లు, అవసరమైన ప్రణాళికలు తయారు చేసి వైద్య ఆరోగ్య శాఖకు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఈఓ విజయకుమారి, డీఆర్‌డీఓ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రఘునాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

### రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఎన్నికల అధికారి

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి హేమంత్ కేశవ పాటిల్

సికింద్రాబాద్,ఏప్రిల్ 10: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సికింద్రాబాద్ నియోజకవర్గ పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి ,ఐఏఎస్ హేమంత్ కేశవ పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈనెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.అందుకు నామినేషన్ ప్రక్రియకు సంబంధించి పలు రకాల సలహాలు,సూచనలు ఇవ్వాలని రాజకీయ పార్టీ నాయకులను కోరారు.అదేవిధంగా నామినేషన్‌కు సంబంధిం చిన పలు రకాల వివరాలను వారికి వివరించారు.అందుకు సంబంధించి ఎజెండా పత్రం నకలును అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెగ్మెంట్‌లకు సంబంధించిన ఏఆర్ఓలు,రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 15, 16లలో యువజనుల సమస్యలపై సదస్సు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో అవగాహన సద స్సు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తెలిపారు. సదస్సు వాల్ పోస్టర్‌ను బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీ ర్యం చేయడం వల్ల యువతపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు యువత అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

## వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి..

- కూడళ్లు, పార్కు స్థలాల వద్ద చలివేంద్రాల ఏర్పాటు..
- మూగజీవాలకు, పక్షులకు నీరు ఉంచాలి..
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండలో పనిచేసేవారు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య.. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో 'జాతీయ కార్యక్రమం వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యం' అనే అంశంపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి రఘునాథ స్వామితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు కూడళ్ల వద్ద, పార్కుల వంటి స్థలాల వద్ద చలివేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని, చలివేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బయటకు వెళ్లే ప్రతి ఒక్కరు తలపై టోపి, టవల్ ధరించాలని, ఓఆర్ఎస్ కలిపిన నీటిని వెంట తీసుకువెళ్లాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాల్లో ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో పంపిణీ చేయించాలని సూచించారు. మూగజీవాలకు, పక్షులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 'వడదెబ్బ నుండి రక్షించు కుందాం' అనే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిక..

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

మేడ్చల్, ఏప్రిల్ 10 : మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన వైస్ చైర్మన్‌తోపాటు 9 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మానసశ్రావణ్, జాకట దేవా, సాయికుమార్, శివకుమార్, సుహాసిని, ప్రియాంక, కృష్ణవేణి, మాధవి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

చర్లపల్లి, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా నాయ కులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణ కన్వెన్షన్ హాల్‌లో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పరమేశ్వర్‌రెడ్డి, సిద్ధేశ్వర్, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజు శివమణి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ..

చర్లపల్లి, ఏప్రిల్ 10 : చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, ప్రభుగౌడ్‌లు ఎన్నికయ్యారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ కార్యవర్గం, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ : శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ శిబిరాన్ని బుధవారం డిప్యూటీ మేయర్ ప్రారంభించారు.